సాక్షి ఒడిశా

ఆదివారం । 30 । ఏప్రిల్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలక వర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2,89,956లు, బంగారం 2.89 గ్రాములు గ్రాములు, వెండి 180 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



కేంద్రీయ విద్యాలయాన్ని నిర్మించాలి

- 6లో



భటాచించిలో న్యాయసేవా శిబిరం

జయపురం: స్థానిక సమితిలోని డొంగరచించి పంచాయతీ భటాచించి గ్రామంలో న్యాయసేవా శిబిరం నిర్వహించారు. న్యాయమూర్తి సుమన్‌ జెనా వివిధ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

న్యూస్‌రీల్‌

పాలు కాదు.. గంజాయి



గంజాయి, వ్యాన్‌తో పట్టుబడిన నిందితుడు

మల్కన్‌గిరి: సినీ ఫక్కీలో గుట్టు చప్పుడు కాకుండా గంజాయి తరలించేందుకు ఓ వ్యక్తి చేసిన ప్రయత్నం బెడిసి కొట్టింది. పాల వ్యాన్‌లో సరుకు తరలిస్తుండగా.. పోలీసులకు పట్టుబడటంతో నిందితుడు జైలు పాలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని కలిమెల సమితి బేజంగవాడ పంచాయతీ ఎంవీ–69 గ్రామం కలిమెల ఎక్సైజ్‌ అధికారులు శనివారం పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్నారు. అదే సమయంలో మహారాష్ట్రకు చెందిన ఓ పాల వ్యాన్‌లో అటుగా వచ్చింది. అనుమానాస్పదంగా కనిపించడంతో వాహనాన్ని అడ్డుకొని, డ్రైవర్‌ను ప్రశ్నించగా పొంతలేని సమాధానం చెప్పాడు. దీంతో వ్యాన్‌ను తనిఖీ చేయగా, 4బస్తాల్లో గంజాయి మూటలు కనిపించాయి. సరుకుతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకొని, డ్రైవర్‌ అజయ్‌ రాజారాంను అరెస్ట్‌ చేశారు. రూ.5లక్షల విలువైన ఈ గంజాయిని మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచి, కేసు నమోదు చేశారు.

ఇరువురు ఐపీఎస్‌ అధికారుల బదిలీ

భువనేశ్వర్‌: రాష్ట్రంలోని ఇద్దరు ఐపీఎస్‌ అధికారులకు స్థానచలనం చేస్తూ హోంశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం ప్రత్యేక డైరెక్టర్‌ జనరల్‌(కమ్యూనికేషన్‌)గా బాధ్యతలు నిర్వహిస్తున్న 1988 బ్యాచ్‌ ఐపీఎస్‌ అధికారి అరుణ్‌కుమార్‌ రే హోంశాఖ ఆఫీసర్‌ ఆన్‌ స్పెషల్‌ డ్యూటీ(ఓఎస్‌డీ)గా బదిలీ అయ్యారు. మానవ హక్కుల పరిరక్షణ విభాగం(హెచ్‌ఆర్‌పీసీ) ప్రత్యేక డైరెక్టర్‌ జనరల్‌గా పనిచేస్తున్న 1989 బ్యాచ్‌ ఐపీఎస్‌ అధికారి ఎస్‌ఎం నరవణే హోంశాఖ ఆఫీసర్‌ ఆన్‌ స్పెషల్‌ డ్యూటీ(ఓఎస్‌డీ)గా నియమితులయ్యారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఆస్పత్రిలో రమేష్‌ మృతదేహం

రాయగడ: పట్టణంలోని తుంబిగుడ కూడలిలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందారు. మృతుడు సాయిప్రియ నగర్‌కు చెందిన రాయిపల్లి రమేష్‌కుమార్‌(50)గా పోలీసులు గుర్తించారు. మార్కెట్‌లో సామగ్రి ఖరీదు చేసి, బైక్‌పై ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో తుంబిగుడ కూడలికి వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలపాలైన బాధితుడిని అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన నవోదయ రాత పరీక్ష



రాత పరీక్షకు హాజరైన విద్యార్థులు

పర్లాకిమిడి: జిల్లాలోని బెత్తగుడ జవహర్‌ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశం కోసం రాత పరీక్ష శనివారం నిర్వహించారు. గజపతి జిల్లాలో 11 కేంద్రాల్లో పరీక్ష జరగ్గా.. స్థానిక మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో 192 మంది అభ్యర్థులకు గాను 181మంది హాజరయ్యారని హెచ్‌ఎం దుర్గాశి శ్రీరామ్మూర్తి తెలిపారు. జిల్లాలో గుమ్మా, కాశీనగర్, ఆర్‌.ఉదయగిరి, మోహానా కేంద్రాల్లో రాతపరీక్ష జరిగింది.

2,600 మంది హాజరు..

రాయగడ: జిల్లాలో 6వ తరగతి ప్రవేశం కోసం నిర్వహించిన నవోదయ పరీక్షకు 2,600మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి పూర్ణచంద్ర భోరియా తెలిపారు. జిల్లాలోని 11 సమితుల్లో 21 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

ప్రాణి చికిత్సకు ప్రాధాన్యం



రాజవీధి ప్యాలెస్‌ వద్ద చైతన్య ర్యాలీ ప్రారంభిస్తున్న అధికారులు

- పశువైద్య కేంద్రాల్లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం
- కలెక్టర్లు లింగరాజ్‌ పండా, స్వాధాదేవ్‌ సింగ్‌

రాయగడ: పశు సంరక్షణ, వాటి వృద్ధి తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని, తదనుగుణంగా జిల్లాలోని పశువైద్య శాలల్లో మరిన్ని సౌకర్యాలు మెరుగు పరిచేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్‌ స్వాధాదేవ్‌ సింగ్, లింగరాజ్‌ పండా తెలిపారు. శనివారం ప్రపంచ వెటర్నరీ దినోత్సవాన్ని పురస్కరించుకుని, స్థానిక లోటస్‌ హోటల్‌లో జిల్లా పశువైద్య శాఖ శనివారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తూ మహిళల ఆర్థిక సాధికారితకు ఎంతగానో దోహదపడే పాడి పరిశ్రమలు సత్ఫలితాలు ఇస్తాయన్నారు. ప్రధానంగా కోళ్ల పెంపకం వంటివి చేపడుతున్న స్వయం సహాయక బృందాలు ఆయా పరిశ్రమల్లో లాభాలు పొందుతున్నారని తెలిపారు.

అయితే సకాలంలో పశువులకు వైద్య సౌకర్యాలు అందించడం కోసం గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను విస్తృత పరచాలన్నారు. ఈ సందర్భంగా పశువుల సంరక్షణ, ప్రాణి సంరక్షణ తదితర అంశాలపై చైతన్య ర్యాలీ నిర్వహించారు. అనంతరం పశువైద్య శాఖ కార్యాలయంలో కుక్కలకు యాంటీ రాబిష్‌ వ్యాక్సిన్లు టీకాలను వేశారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్య శాఖ ముఖ్య వైద్యధికారి డాక్టర్‌ హడిబంధు భోయ్, డాక్టర్‌ అశోక్‌ కుమార్‌ బెహర, డాక్టర్‌ ప్రచరణ బెహరా, డాక్టర్‌ నరేష్‌చంద్ర జెనా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ పాడి రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు.

సంఘాలకు కోళ్ల పంపిణీ..

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో మహిళల ఆర్థిక స్వావలంబనకు ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు వెయ్యి లేయర్‌ కోళ్ల ఫాంలు అందజేశామని కలెక్టర్‌ లింగరాజ్‌ పండా తెలిపారు. జెడ్పీ మందిరంలో వెటర్నరీ కార్యాలయం ఆధ్వర్యంలో ప్రపంచ ప్రాణిచికిత్సా దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ స్వాతి ఎస్‌.కుమార్, డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి రమాంచల్‌ ఖమారి, జిల్లా వెటర్నరీ అధికారి రమాకాంత్‌ మహారణా, జిల్లా నీటి నిల్వ సామర్థ్య శాఖ, పీడీ సురేష్‌కుమార్‌ పట్నాయక్‌ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు గజపతి ప్యాలెస్‌ నుంచి విద్యార్థులు, వెటర్నరీ అధికారులు చైతన్యర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం చివర్లో టమహిళా స్వయం సహాయక గ్రూపులకు జిల్లా కలెక్టర్‌ ద్వారా ప్రోత్సాహకాలు అందజేశారు.



శునకానికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్‌ లింగరాజ్‌ పండా



పాడి రైతుకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్‌ సింగ్, భాయి

నెక్కంటిపై క్రైంశాఖ విచారణ జరపాలి

- కాంగ్రెస్‌ మీడియా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్వర బెహరా డిమాండ్‌
- మావోయిస్టుల పేరిట నిధుల సమీకరణపై తీవ్ర ఆరోపణలు



కాంగ్రెస్‌ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న గణేశ్వర బెహరా

భువనేశ్వర్‌: ఛత్తీస్‌గఢ్‌ మావోయిస్టుల దాడిలో 10మంది పోలీసులను మావోయిస్టులు హతమార్చిన విషాదఛాయలు తొలగక ముందే సంచలనాత్మక ఆరోపణలు తెరకెక్కాయి. అధికార పార్టీ బిజూ జనతాదళ్‌ నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు నెక్కంటి భాస్కరరావు మావోయిస్టులకు ఆర్థికసాయం అందిస్తున్నారని కాంగ్రెస్‌ పార్టీ బహిరంగంగా ఆరోపించింది. ఈ మేరకు భువనేశ్వర్‌ లోని కాంగ్రెస్‌ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్‌ మీడియా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీమంత్రి గణేశ్వర్‌ బెహరా మాట్లాడారు. ఒడిశాలో మావోయిస్టులకు నెక్కంటి నిధులు సమకూర్చుతున్నారని ఆరోపించారు. ఇటీవల రాయగడలో లారీ యజమానుల సంఘం సభ్యులతో సంప్రదించి దళం కోసం డబ్బులు చెల్లించాలని డిమాండ్‌ చేశారన్నారు. ఒక్కో ట్రక్కుకు రూ.50 వేల చొప్పున చెల్లించాలని యజమానులకు తెలిపారని పేర్కొన్నారు. ఈ పరిణామంతో లారీ యజమానుల సంఘం పోలీసులకు ఫిర్యాదు చేసిందని, అయితే పోలీసు చర్యలు చేపట్టక పోవడం పట్ల సందేహం వ్యక్తం చేశారు. ఈనెల 18న రాయగడ పోలీస్‌ స్టేషన్‌లో సంఘం తరఫున లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా, పోలీసులు ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టకుండా మౌనం వహించారన్నారు. ఈ విషయంలో చట్టం తన పని తాను చేసుకుంటుందో లేదో బీజేడీ అధిష్టానం తెలియజేయాలన్నారు. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్‌ పట్నాయక్‌ పాలనలో చట్టం సామాన్యుడికి ఇతర వర్గాలకు సమానంగా వర్తింపజేస్తున్న విషయం స్పష్టం చేయాలని డిమాండ్‌ చేశారు. రాష్ట్రప్రభుత్వం, బీజేడీ నాయకులు మావోయిస్టులపై పోరాడుతున్నామని తరచూ ప్రకటిస్తుండగా.. నిషేధిత వర్గాల కోసం నెక్కంటి భాస్కరరావు డబ్బులు వసూలు చేయడం ఆశ్చర్యం కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. ఈ ఆరోపణలపై క్రైం బ్రాంచ్‌ విచారణ జరిపించాలని డిమాండ్‌ చేశారు.

శబరి శ్రీక్షేత్ర భక్తులకు అస్వస్థత

- 20మంది క్షేమం.. విషమంగా మహిళ ఆరోగ్యం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

జయపురం: జిల్లా కేంద్రంలోని శబరి శ్రీక్షేత్ర జగన్నాథ మందిర అతిథి భవనంలో మధ్యాహ్న భోజనం చేసిన పలువురు భక్తులు అస్వస్థతకు గురయ్యారు. బాధితులను వెంటనే సహిద్‌ లక్ష్మణ నాయక్‌ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించగా, ప్రాథమిక చికిత్స అనంతరం పలువురు కోలుకున్నారు. ఓ మహిళ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. భోజనంలో ఏదో విషపూరిత పదార్థం కలవడం కారణంగానే అస్వస్థతకు గురయ్యారని వైద్యులు అభిప్రాయం వ్యక్తంచేశారు. కంద దుంపల కూరంలో అడవి దుంప కలిసి ఉండవచ్చని మందిర పరిచాలన కమిటీ సభ్యులు భావిస్తున్నారు. శబరి శ్రీక్షేత్ర జగన్నాథ మందిరానికి వచ్చే పర్యాటకులు, భక్తుల సౌకర్యార్థం అతిథి భవనాన్ని నెలకొల్పారు. ఇక్కడ భోజనాలు చేసేవారికి ఉల్లి, వెల్లుల్లి లేకుండా వంట చేస్తారు. దీనికి సంబంధించి ప్రాంగణంలోనే క్యాంటీన్‌ ఏర్పాటు చేశారు. బసచేసిన భక్తులంతా అక్కడే భోజనాలు చేయగా, 21మంది అస్వస్థతకు గురైనట్లు గుర్తించారు. ఘటనపై మందిర పరిచాలన కమిటీ దర్యాప్తుకు ఆదేశించింది.

గదబగుడలో వంతెన నిర్మాణం



వంతెన నిర్మించనున్న ప్రాంతం

- రూ.3.87 కోట్లు కేటాయించిన రాష్ట్రప్రభుత్వం
- పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి సరక



వంతెన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి జగన్నాథ సరక

రాయగడ: జిల్లాలోని బిసంకటక్‌ సమితి గదబగుడలో సుమారు రూ.3.87 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న వంతెన నిర్మాణానికి రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖమంత్రి జగన్నాథ సరక శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజూ సేతు పథకంలో భాగంగా ఈ ప్రాంత ప్రజల డిమాండ్‌ మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న బిసంకటక్‌ నియోజకవర్గంలోని సదరు సమితికి సుమారు 3కిలోమీటర్ల దూరంలోని గదబగుడ, నువాసాహి, జగన్నాథపూర్‌ గ్రామాలు ఉన్నాయి. నాగావళి నదికి ఆవతలి వైపు ఉన్న ఈ గ్రామాల్లో సుమారు 500కి పైగా ప్రజలు నివాసం ఉంటున్నారు. ఏటా వర్షాకాలంలో నదీ ప్రవాహం ఉధృతమవ్వడంతో ఈ గ్రామస్తులు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటారు. ఏటా ఇదే పరిస్థితి నెలకొంటుండంతో గదబగుడలో వంతెన నిర్మించాలని సమస్యను స్థానికులు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన ప్రభుత్వం బిజూ సేతు పథకంలో నిధులు కేటాయించినట్లు మంత్రి పేర్కొన్నారు. రహదారులు, రాకపోకలు, విద్య, వైద్యం వంటి మౌలిక సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని వివరించారు. కార్యక్రమంలో బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుధీర్‌దాస్‌ పాల్గొన్నారు.

బీకేఎంయూ రాష్ట్ర సమ్మేళనం విజయవంతం



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీకేఎంయూ ప్రతినిధులు

పర్లాకిమిడి: వ్యవసాయ, గ్రామీణ శ్రామిక సంఘటన్‌ భారతీయ ఖేత్‌ మజ్దూర్‌ సంఘ్‌(బీకేఎంయూ) పదో రాష్ట్ర సమ్మేళనం విజయవంతంగా ముగిసింది. స్థానిక టౌన్‌ హాలులో శనివారం జరిగిన ఈ సదస్సులో సంఘం రాష్ట్ర కార్యదర్శి సురో జెన్నా జెండా అరుణ పతకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడు జొన్న సుభాష్‌ చంద్రరావు అధ్యక్షత వహించగా, ఆల్‌ ఇండియా బీకేఎంయూ కార్యదర్శి గుల్జార్‌సింగ్‌ గోరియా పాల్గొని, మాట్లాడారు. వ్యవసాయ కార్మికులకు రూ.800ల రోజువారీ వేతనం మంజూరు చేయాలని, సామాజిక సురక్ష, వెనుకబడిన తరగతుల వారికి ఇళ్ల పట్టాలు, భూపట్టాలు మంజూరు చేయాలని డిమాండ్‌ చేశారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ మాజీ కార్యదర్శి ఆశిష్‌ కానుంగో, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమణిరంజన్‌ రౌత్రాయ్, ఆంధ్రప్రదేశ్‌ నాయకులు ధర్మారావు, అఖిల భారత యువ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్‌ శెఠి, రాష్ట్ర సాధారణ కార్యదర్శి నిర్మలా నాయక్, ఉపాధ్యక్షుడు బిద్యాధర జెన్నా తదితరులు పాల్గొన్నారు.

తుపాకీతో లొంగిపోయిన నిందితుడు



నిందితుడు ఇమ్రాన్‌ఖాన్‌



పోలీసులు స్వాధీనం చేసుకున్న తుపాకీ

జయపురం: పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారిపై మార్చి 4న తుపాకీతో కాల్పుల ఘటనలో ప్రధాన నిందితుడు ఇమ్రాన్‌ఖాన్‌ ఎట్టకేలకు కోర్టులో లొంగిపోయాడు. పోలీసులు అతడిని విచారించడానికి 3రోజుల రిమాండ్‌కు తరలించారు. విచారణలో ఇమ్రాన్‌ నేరం అంగీకరించాడని, కాల్పుల్లో వినియోగించిన తుపాకీ, పేలని బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు.

ఆకట్టుకుంటున్న ఖోళాకుంజ రథాలు



ఆకట్టుకుంటున్న నర్సింహావతార రథం

- మాబుడి శాంతమ్మ సంబరాల్లో పోటెత్తిన భక్తజనం



సంబరాలలో రథంపై శివపార్వతులు

బరంపురం: జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన బరంపురం గ్రామదేవత, నగర వాసులకు కొంగు బంగారం మాబుడి శాంతమ్మ సంబరాలు 24వ రోజుకు చేరుకున్నాయి. భక్తజన సందోహంతో సంబరాల ప్రాంగణం కళకళలాడుతూ కిక్కిరిసింది. శనివారం వేకువజాము ఆలయ ప్రధానార్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తుల దర్శనాలకు అవకాశం కల్పించగా, శాంతమ్మకు మొక్కుబడులు చెల్లించుకున్నారు. సంబరాల సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల ఖోళాకుంజ రథాలు రాత్రి వేళల్లో విద్యుత్‌ కాంతులు విరజిమ్ముతూ నగరమంతా తిరుగుతూ భక్తులను ఆకట్టుకుంటున్నాయి. వీటిని చూసేందుకు సందర్శకులు, చిన్నారులు ఆసక్తి చూపారు. సాయంత్రం తాత్కాలిక ఆలయ ప్రాంగణంలో సంబరాల నిర్వాహకులు పాతర్ల దుర్గాప్రసాద్‌ దేశిబెహరా సతీమణి పాతర్ల రేవతి అమ్మవారి ప్రధాన ఘటంతో బయలుదేరి, పలు వీధుల్లో ఘట పరిక్రమ సాగించారు. మహిళలు తరలివచ్చి, పసుపు నీళ్లతో పాదాలు కడిగి చల్లదనం చేశారు. సంప్రదాయ ఊలాలతో హారతులిచ్చారు.

గిరిజనులకు కంప్యూటర్‌ శిక్షణ

- కొరాపుట్‌ డీఐజీ రాకేష్‌ పండిత్‌



స్థానిక సమస్యలపై చర్చిస్తున్న డీఐజీ రాకేష్‌ పండిత్‌



గిరిజనులకు సామగ్రి అందిస్తున్న డీఐజీ

మల్కన్‌గిరి:

జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్‌ ఏరియా జోడాంభొ పంచాయతీలో కొరాపుట్‌ డీఐజీ రాకేష్‌ పండిత్‌ సమక్షంలో కంప్యూటర్‌ శిక్షణా కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఒకప్పుడు స్వాభిమాన్‌ ఏరియాను కటాఫ్‌ ప్రాంతంగా పిలిచేవారని, ప్రస్తుతం గురుప్రియ వంతెన నిర్మాణంతో ఎంతోమంది యువతీ, యువకులు చదువుపై మక్కువ చాటుతూతున్నారన్నారు. ఈ నేపథ్యంలో వారికి కంప్యూటర్‌ శిక్షణ అందించేలా మల్కన్‌గిరికి చెందిన వ్యక్తులు తర్ఫీదు అందిస్తారని తెలిపారు. అలాగే ఆంద్రహల్, గజాల్‌మాముడి, జంత్రి, పనాస్పుట్‌ పంచాయతీలకు చెందిన వారికి నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో చిత్రకొండ ఎస్‌డీపీఓ అలెక్స్‌ కిస్పేట, చిత్రకొండ ఐఐసీ ముకుందో మాల్కొ బీఎస్‌ఎఫ్‌ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కన్యాకుమారి సినిమా చిత్రీకరణ పూర్తి



హీరోయిన్‌కు సీన్ వివరిస్తున్న డైరెక్టర్ దామోదర్

శ్రీకాకుళం కల్చరల్: నగరంలో పదిరోజులుగా రాడికల్స్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'కన్యాకుమారి' సినిమా చిత్రీకరణ పూర్తయిందని చిత్ర దర్శకుడు దామోదర్ తెలిపారు. హ్యాపీ షాపింగ్ మాల్, మహిళా కళాశాల, కుందువానిపేట బీచ్ తదితర ప్రాంతాల్లో సన్నివేశాలు చిత్రీకరించినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతంలో నివసించే యువతీ, యువకుల ప్రేమకథా, హాస్య ప్రధానంగా చిత్రాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. శ్రీకాకుళం యాసలో సంభాషణలు ఉంటాయని, త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తామని చెప్పారు. శ్రీచరణ్, గీతాషైనీ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం సాహిత్య సాగర్, కెమెరా శివ గాజుల, సహనిర్మాతలు సతీష్ రెడ్డి, వరీనియా మామిడి, సిద్ధార్థ్ అని తెలిపారు. గతంలో ఆనంద్ దేవరకొండ హీరోగా 'పుష్పకవిమానం' నిర్మించామని, ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించిందని, ఈ చిత్రాన్ని ఆశీర్వదించాలని కోరారు.

డిగ్రీ స్పాట్ రెమ్యూనరేషన్ విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ పరీక్షల మూల్యాంకన రెమ్యూనరేషన్‌ను విడుదల చేసినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ శనివారం తెలిపారు. మొదటి, రెండు, మూడు, నాలుగు సెమిస్టర్లకు సంబంధించి రూ.30.49 లక్షలు విడుదలైనట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం గాయత్రి సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలల్లో మూల్యాంకన శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు.

180 మద్యం బాటిళ్ల స్వాధీనం

సంతబొమ్మాళి: పాలేశ్వరస్వామి జంక్షన్ వద్ద 180 మద్యం బాటిళ్లను శనివారం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుసూధనరావు తెలిపారు. ఎం.సున్నాపల్లి గ్రామానికి చెందిన అర్జాల ఈశ్వరరావు వివిధ మద్యం షాపుల నుంచి 180 మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి స్వగ్రామం తరలించాలనే ప్రయత్నంలో ఉన్నారు. పోలీసులకు సమాచారం రావడంతో నిందితుడిని పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందించే సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జేసీ ఎం.నవీన్ వైద్యాధికారులను కోరారు. ఆరోగ్య శ్రీ సేవలు, పాటించాల్సిన అంశాలపై ఆయన శనివారం వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. బయోమెట్రిక్ తప్పకుండా అమలు చేయాలన్నారు. ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన యాప్‌లను విధిగా వినియోగించాలన్నారు. జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయకర్త పి.ప్రకాశరావు మాట్లాడుతూ బయోమెట్రిక్ ద్వారానే మిత్రాలకు ఆసరా చెల్లింపులు ఉంటాయని స్పష్టం చేశారు. మే 1వ తేదీ నుంచి ప్రతి మిత్రా కూడా ఆస్పత్రుల్లో బెడ్ మీద ఉన్న పేషెంట్ వద్దకు వెళ్లి ఫొటోను తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు.

విద్యార్థుల హాజరు బాధ్యత ప్రిన్సిపాల్స్‌దే

- కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్



మాట్లాడుతున్న కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్

టెక్కలి: విద్యార్థులు ప్రతిరోజూ కళాశాలకు వచ్చేలా చూడాల్సిన బాధ్యత ప్రిన్సిపాల్స్‌దేనని కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్ అన్నారు. జోన్-1 పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్లతో శనివారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల నిర్వహణతో పాటు అకడమిక్ విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు చెబితే కచ్చితంగా కళాశాలకు వస్తారని చెప్పారు. కేవలం జీతం వస్తే చాలు అనే ధోరణి విడనాడాలన్నారు. విద్యార్థులుగా ఉన్న కాలంలో తమ అధ్యాపకులు ఏ విధంగా ఉండాలి అని భావించారో...అధ్యాపకులు కాగానే వారిలో మార్పులను ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. ప్రతి కళాశాలకు నాక్ గుర్తింపు వచ్చేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశంలో జోన్-1 ఆర్‌జేడీ శోభారాణి, నాక్ సీసీఈ కె.విజయ్‌బాబు, కమిషనర్ కార్యాలయం సిబ్బంది డి.శంకరరావు, స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయాన్ని నిర్మించాలి



ధర్నాలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

- కేంద్రాన్ని డిమాండ్ చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి
- లేనిపక్షంలో మే 9న జిల్లా బంద్ చేపడతామని అల్టిమేటం

జయపురం: జిల్లా ప్రజల సమస్యలు, డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి విమర్శించారు. కొరాపుట్ జిల్లా అధ్యక్షురాలు మీనాక్షి బాహిణీపతి పిలుపు మేరకు వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు జయపురం మెయిన్ రోడ్డులో కేంద్రప్రభుత్వ విభాగమైన ప్రధాన తపాలా కార్యాలయం ముందు శనివారం ధర్నాకు దిగారు. జయపురంలో కేంద్ర విద్యాలయాన్ని వెంటనే ప్రారంభించాలని, కేంద్ర డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జయపురంలో అనేక కేంద్రప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయని, వాటిలో వందలామంది ఉద్యోగులు పనిచేస్తున్నా వారి పిల్లలకు కనీస విద్య సౌకర్యాలను కేంద్రం కల్పించడం లేదని విమర్శించారు. జిల్లాలో వాణిజ్య కేంద్రం, ముఖ్య పట్టణమైన జయపురంలో ఎంతోకాలంగా కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నా పట్టించుకోక పోవడం దారుణమన్నారు. కేంద్ర విద్యాలయానికి అవసరమైన అన్ని వనరులు, సౌకర్యాలు స్థానికంగా ఉన్నా.. కాలయాపన చేస్తున్నారు తప్ప, హామీలు కార్యరూపం దాల్చడంలేదని దుయ్యబట్టారు. అలాగే కేంద్రప్రభుత్వం తరఫున డ్రైవింగ్ శిక్షణ, రీసెర్చ్ కేంద్రం నెలకొల్పాలని డిమాండ్ చేశారు. వెంటనే జయపురంలో కేంద్రీయ విద్యాలయం పనులు ప్రారంభించకపోతే మే 9న జిల్లా బంద్ చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, పీసీసీ సభ్యులు రామచంద్ర పాఢి, బొరిగుమ్మ బ్లాక్ అధ్యక్షుడు అశోక్ గంతాయిత్, జయపురం బ్లాక్ అధ్యక్షుడు బసంత నాయక్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బినోద్ మహాపాత్రా, కోశాధిపతి నిహార్ బిశాయి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుకాంత పటా్నయక్, మహిళ, ఛాత్ర, నాయకులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే తారాప్రసాద్

భూముల రీసర్వేపై సమీక్ష



భూముల రీసర్వేపై సమీక్షిస్తున్న తహసీల్దారు సోమేశ్వరరావు

పాలకొండ: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌ఓలతో తహసీల్దారు పి.సోమేశ్వరరావు శనివారం సమావేశమై, భూముల రీసర్వేపై సమీక్షించారు. గ్రామాల వారీగా పూర్తి చేసిన సర్వే వివరాలతో పాటు, ప్రస్తుతం ఎక్కడెక్కడ సర్వే జరుగుతోంది.. సర్వే ఎంతవరకు వచ్చిందన్న అంశాలపై ఆరాతీశారు. రైతుల సమక్షంలోనే సర్వే, హద్దురాళ్ల ఏర్పాటు వంటివి జరిగే లా చూడాలని సూచించారు. పక్కాగా సర్వే చేసి, రైతుల మధ్య నెలకొన్న భూతగాదాలు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో మండల సర్వేయర్ పి.వెంకరావు, డిప్యూటీ తహసీల్దారు బుచ్చయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పాలకొండ రూరల్: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీఓ ఎస్.గీత శనివారం తెలిపారు. నాన్ టీఎస్‌పీ పరిధి లో బెజ్జి(ఓసీ), పెద్దకాపు వీధి(ఓసీ), అట్టలి (ఓసీ-ఈబీసీ)లోని కేంద్రాల్లో ఆయా పోస్టులు, టీడీ పారాపురం (ఓసీ), అర్దలి(ఎస్సీ)లో అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై, 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలని, మే 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా పాలకొండ గారమ్మ కాలనీలోని ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

మే 1 నుంచి గ్రామదేవత ఉత్సవాలు

గరుగుబిల్లి: మండలంలోని దళాయివలస గ్రామంలో కొలువైన శ్రీరేగాలమ్మ గ్రామదేవత ఉత్సవాలు మే 1వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఉత్సవాల నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

శివ్వన్నపేటలో ఏనుగుల గుంపు తిష్ట

కురుపాం: స్థానిక శివ్వన్నపేట సమీపంలోని సోమ సాగరం చెరువులో ఏనుగుల గుంపు తిష్టవేశాయి. జియ్యమ్మవలస, కొమరాడ, గరుగుబిల్లి మండలా ల్లో సంచరించిన ఏనుగుల గుంపు శనివారం వేకువజామున చెరువు దగ్గరకు చేరుకున్నాయి. వేసవి నేపథ్యంలో నీరు ఎక్కువగా ఉన్న చెరువు వద్దకు వచ్చి, సేదతీరుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ఆ పరిసర పొలాల రైతులు అటువైపుగా వెళ్లి, పనులు చేసుకునేందుకు ఆందోళన చెందుతున్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



వంబరెల్లిలో ఇంటింటికీ వెళ్లి, పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్తగూడ పంచాయతీ పరిధిలోని వంబరెల్లి, పెద్దగూడ, నాయుడుగూడ, దీసరిగూడ, బుడ్డడుగూడ గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆమెకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్న చిన్న సమస్యలను పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీదేనన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆదినారాయణ, సర్పంచ్ సుశీల, పార్టీ నాయకులు ఎస్.రాము, ఎం.రామారావు, అప్పారావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు

వీరఘట్టం: స్థానిక పట్టణంలో ఆదివారం నుంచి పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు నిర్వహించనున్నారు. మే 10వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు, యాత్రికులు, పర్యాటకులు, సందర్శకులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ఉత్సవాల ప్రారంభం నాడు ఉదయం యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో ఉజ్జిడి పోలమ్మ సంబరం చేస్తారు. సోమవారం సాయంత్రం వనంలోని పైడితల్లి అమ్మవారిని ఊరేగింపుగా ఊరిలోకి తీసుకువచ్చి, బోయిడు ఇంట్లో కొలువుదీరుస్తారు. 3వ తేదీన అమ్మవారి ఘటాలు, పాలజంగిడిని వీధుల్లో ఊరేగిస్తారు. 9వ తేదీన అంజలిరథం, సిరిమానోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఇప్పటికే అమ్మవారి ఆలయానికి సరికొత్త రంగులద్ది, ముస్తాబు చేశారు. మందిరం ఆవరణ, సమీప వీధులన్నీ విద్యుత్‌దీపాలంకరణతో ఓ వెలుగు వెలిగిపోతున్నాయి. దాదాపు తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో రోజుకో సాంస్కృతిక కార్యక్రమంతో ప్రజలను అలరించేందుకు ఉత్సవ కమిటీ నిర్ణయించింది.

కార్యక్రమ వివరాలిలా..



ముస్తాబైన పైడితల్లి అమ్మవారి ఆలయం



ప్రత్యేకాలంకరణలో పైడితల్లి అమ్మవారు

- మే 2 నుంచి 4వ తేదీ వరకు బెంగుళూరు వాస్తవ్యులు వేమ సుబ్రహ్మణ్యగుప్తచే అమ్మవారి ప్రవచనాలు
- మే 2న రాత్రి 9 గంటలకు శ్రీమద్రామాయణ కథారూప నాటక ప్రదర్శన
- మే 3న రాత్రి 9 గంటలకు ఆనందపురం వాస్తవ్యులచే బాలనాగమ్మ బుర్రకథ, సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన
- మే 4న రాత్రి 9 గంటలకు స్థానిక కళాకారులచే సత్యహరిశ్చంద్ర నాటకం
- మే 5న రాత్రి 9 గంటలకు నరసన్నపేట వాస్తవ్యులు సాయిగీత్ సంగీత్ మ్యూజికల్స్ వారిచే నాయుడు ఆర్కెస్ట్రా
- మే 6న రాత్రి 9 గంటలకు స్థానిక కళాకారులచే మాఊరు అనే సాంఘిక నాటకం ప్రదర్శన
- మే 7న రాత్రి 9 గంటలకు విశాఖపట్నం వాస్తవ్యులచే డ్యాన్స్ బేబీ డ్యాన్స్
- మే 8న రాత్రి 9 గంటలకు జబర్దస్త్, విజయనగరం రఘు బృందం, చీపురుపల్లి లక్ష్మణ బృందంతో రేలారే రేలా ప్రోగ్రాం
- మే 9న రాత్రి 9 గంటలకు ఎక్స్‌ట్రా జబర్దస్త్ టీమ్ రోబోటిక్ డ్యాన్స్ ఈవెంట్, సినీ మ్యూజికల్ నైట్ ప్రోగ్రాం

అటానమస్ కళాశాలలో గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముదలి

రాయగడ: పట్టణంలోని అటానమస్ కళాశాలలో నాగావళి హాస్టల్ విద్యార్థుల కోసం సుమారు రూ.13.5 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రంథాలయం భవనాన్ని రాయగడ ఎమ్మెల్యేమకరంద ముదులి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్న స్థానిక కళాశాలలో ఎంతోమంది ఆదివాసీ విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారని గుర్తు చేశారు. విద్యార్థుల సౌకర్యార్థం గ్రంథాలయం ఏర్పాటు ఎంతో అవసరమని భావించి, దీనిని నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీకే గంతాయిత్, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: వేసవి నేపథ్యంలో పక్కాగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆదేశించారు. మండలంలోని వండువ గ్రామంలో తన నివాసంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో శనివారం సమావేశమైన ఆమె గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాడైన తాగునీటి బోర్లను యుద్ధప్రాతిపదికన బాగుచేసి, తాగునీరు అందివ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావు, డీఈ ఢిల్లేశ్వరరావు, ఏఈ పాపారావు పాల్గొన్నారు.

వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్త వహించాలి



రోగుల ఆరోగ్యం తనిఖీ చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక

గరుగుబిల్లి: వేసవి ఎండల నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్త వహించాలని గరుగుబిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పి.ఎ.ప్రియాంక సూచించారు. శనివారం మండలంలోని ఉల్లిభద్ర గ్రామ సచివాలయం పరిధిలోని సీతారాంపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించి, పలువురికి వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉపాధి హామీ పనులతో పాటు ఇతర పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారంతా గొడుగు, వాటర్ బాటిల్ వెంట తీసుకువెళ్లాలని తెలిపారు. వీలైనప్పుడల్లా ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు తాగాలన్నారు. ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది రమణమ్మ, అనిత, మాలతి, రామకృష్ణ పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



జియ్యమ్మవలస: పల్లపుసిరిపి గ్రామంలో హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంపీడీఓ రమేష్

జియ్యమ్మవలస: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎస్.రమేష్ సూచించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పల్లపుసిరిపి గ్రామంలో జగనన్న కాలనీ ఇళ్లి నిర్మాణాలను ఆయన శనివారం పరిశీలించారు. నిర్మాణాలు చేస్తున్న వారికి సకాలంలో నిర్మాణ సామగ్రి, బిల్లులు చెల్లించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్దూరులో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను గృహ నిర్మాణ శాఖ డీఈ పి.మోహనరావు శనివారం పరిశీలించారు. డివిజన్‌లోని ఏడు మండలాల్లో మొత్తం 2,611 ఇళ్లు మంజూరయ్యాయని, లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టి, పూర్తి చేయాలని డీఈ సూచించారు. నిర్మాణాలు చేస్తున్న వారీగా దశల వారీగా నిర్మాణ సామగ్రి, బిల్లులు ఇవ్వడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఏఈ వి.అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



బొడ్డగూడ కొండపై జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణారావు

భామిని: మండలంలోని బొడ్డగూడ, ఏటంగూడ గిరిజన గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు శనివారం పరిశీలించారు. జాబ్‌కార్డు ఉన్న వారినే పనులకు అనుమతించాలని, పనులు చేస్తున్న వారికే మస్తరు వేయాలని ఆయన సూచించారు. నిర్దేశిత కొలతల్లో నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేస్తే రోజుకు రూ.257 గిట్టుబాటు వేతనం వస్తుందన్నారు. వేసవి నేపథ్యంలో వేతనదారులు వడదెబ్బ బారినపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్ ఉండేలా చూసుకోవాలన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన

సీతంపేట: పార్వతీపురంలోని ఉద్యాన కళాశాలలో సీతంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు క్షేత్ర పర్యటన చేశారు. బీఎస్ఈ(సీబీజెడ్), బీఏ (హెచ్ఈపీ) చదువుతున్న విద్యార్థులంతా అక్కడ పండించే పంటలు, సాగు విధానాలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం తోటపల్లి రిజర్వాయర్‌ను సందర్శించి, సాగునీటి ప్రాధాన్యత, చేపలపెంపకంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవనజ్యోతి పాల్గొన్నారు.

అసిరితల్లికి ఊయలసేవ

పాలకొండ రూరల్: అసిరితల్లి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కొండాపురం గ్రామంలో అమ్మవారికి శనివారం ఊయలసేవ నిర్వహించారు. అమ్మవారి ఘటాన్ని ఊయలలో ఉంచి, ఊపుతూ ప్రత్యేక పూజలు చేశారు.



అసిరితల్లికి ఊయలసేవ చేస్తున్న భక్తులు

పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యసేవలు



అన్నవరం పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ జగన్నాథరావు

పాలకొండ: పీహెచ్‌సీల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు సూచించారు. మండలంలోని అన్నవరం గ్రామ పీహెచ్‌సీని శనివారం సందర్శించిన ఆయన అక్కడి రోగులకు అందుతు న్న సేవలపై ఆరాతీశారు. ప్రధానంగా ఆస్పత్రి లో జరుగుతున్న ప్రసవాలు, స్టాక్ రిజిస్టర్, సిబ్బంది హాజరు, పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులను మంచి చూసుకోవాలని, సక్రమంగా తనిఖీలు చేసి, అవసరమైన మందులు అందివ్వాలని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి కమలనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

సెలవుల్లోనూ చదివేలా ప్రోత్సహించండి



గుమ్మలక్ష్మీపురం: జెడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం అనంతరం డీఈఓ వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న సిబ్బంది



గుమ్మలక్ష్మీపురం కేజీబీవీలో విద్యార్థినులకు ప్రొగ్రాస్ కార్డులు అందజేస్తున్న ఏటీడబ్ల్యూఓ సురేష్‌కుమార్



భామిని: గురుకుల పాఠశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయనిర్మల



కొమరాడ: మాదలింగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు పిల్లల ప్రొగ్రాస్ కార్డులు అందజేస్తున్న ఎంఈఓ నారాయణస్వామి



జియ్యమ్మవలస: బిత్రపాడు పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు సూచనలిస్తున్న ప్రధానోపాధ్యాయుడు గాయత్రీరావు

2022-23 విద్యాసంవత్సరానికి ముగింపు పలికారు. ఆదివారం నుంచి వేసవి సెలవులు కావడంతో అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం(పేరెంట్స్ మీటింగ్) శనివారం నిర్వహించి, విద్యార్థుల విద్యాప్రగతిపై సమీక్షించారు. ప్రొగ్రాస్ కార్డుల్లో పేర్కొన్న మార్కుల ఆధారంగా వారి ప్రతిభాపాటవాలను తల్లిదండ్రులకు సిబ్బంది వివరించారు. సెలవుల్లోనూ విద్యార్థులు చదువుకునేలా ప్రోత్సహించాలని, ఆటపాటలతో పాటు విద్యలోనూ బాగా రాణించేలా చూడాలన్నారు. పాఠశాలల పునఃప్రారంభం రోజునే పిల్లలను బడికి పంపిచాలని కోరారు.

-పాలకొండ, కురుపాం సాక్షి నెట్‌వర్క్

క్లుప్తంగా

5 నుంచి జాతీయ స్థాయి స్పోర్ట్స్ డ్యాన్స్ పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కొత్తవలస : ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ డ్యాన్స్ అసోషియేషన్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మే 5నుంచి 7 వరకు విజయనగరం జిల్లా భోగాపురం సమీపంలోని మిరాకల్ ఎడ్యుకేషనల్ సొసైటీ వద్ద జాతీయ స్థాయి స్పోర్ట్స్ డ్యాన్స్ చాంపియన్ పోటీలను నిర్వహించనున్నట్లు చిరంజీవి స్పోర్ట్స్ ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ పి.రుకమాకారావు తెలిపారు. ఆల్ ఇండియా మెగాస్టార్ చిరంజీవి స్పోర్ట్స్ ఫౌండేషన్ సహకారంతో ఈ పోటీలు జరగనున్నట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కొత్తవలసలో శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి ఎ.ప్రకాష్, ప్రముఖ న్యాయవాది గొడుగుల మహేంద్ర, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రాలీ తిరగబడి ఇద్దరికి గాయాలు



108లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

రేగిడి : మండలంలోని కోడిశ గ్రామ సమీపంలో శనివారం రాళ్లతో వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడి పలువురికి గాయాలయ్యాయి. అంబకండి గ్రామానికి చెందిన ఎస్.అచ్చుతరావు, పాలవలస అప్పలనాయుడులకు ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు కాగా, అటువైపుగా వెళ్తున్న తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి బాధితులను 108 వాహనంలో రాజాం ఆస్పత్రికి తరలించారు. ఈఎంటీ ఈశ్వరరావు ప్రాథమిక చికిత్స చేశారు.

పశువుల శాలలు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న రాజాం అగ్నిమాపక సిబ్బంది

తెర్లాం: మండలంలోని చీకటిపేట గ్రామంలో శనివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు పశువుల శాలలు దగ్ధమయ్యాయి. ప్రమాదవశాత్తు సంభవించిన అగ్ని ప్రమాదంలో చీకటి చంద్రరావు, సింహాచలం, చిన్నంనాయుడులకు సంబంధించిన మూడు పశువుల శాలలు కాలిపోయాయి. పశువుల శాలలు కాలిపోతున్న సమయంలో పశువులు శాలలో లేకపోవడంతో ఎటువంటి నష్టం వాటిల్లలేదు. పశువుల శాలల పక్కనే షెడ్‌లో ఉన్న కారు పాక్షికంగా దెబ్బతింది. సమాచారం రాజాంలోని అగ్నిమాపక కేంద్రానికి స్థానికులు తెలియజేయడంతో వెంటనే అగ్నిమాపక కేంద్రం అధికారులు, సిబ్బంది శకటంతో వచ్చి మంటలు అదుపు చేశారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ.60వేలు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశామని వీఆర్ఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ దోల రాజేశ్వరరావు తెలిపారు.

స్నేహితుల దాడి



చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు

పార్వతీపురం: తను ప్రేమించిన వ్యక్తితో స్నేహితుడు చనువుగా ఉండటాన్ని ప్రశ్నించినందుకు దాడి చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పార్వతీపురం అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు... కొమరాడ మండలం విక్రాంపురం గ్రామానికి చెందిన ఎం.శ్రీనివాసరావు తను ప్రేమించిన అమ్మాయితో స్నేహితుడు వాసు చనువుగా ఉండటాన్ని ప్రశ్నించినందుకు వాసుతో పాటు మరికొందరు గాయపరిచారు. ఈ మేరకు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

విధుల్లో అలక్ష్యం చేస్తే కఠిన చర్యలు

- భామిని వైద్యాధికారులకు షోకాజ్‌నోటీస్‌లు

భామిని: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఐటీడీఏ పీఓ కె.కల్పనాకుమారి హెచ్చరించారు. భామిని పీహెచ్‌సీని శనివారం తనిఖీ చేశారు. ఇద్దరు వైద్యాధికారులు గైర్హాజరుకావడంపై మండిపడ్డారు. షోకాజ్ నోటీస్‌లు ఇవ్వాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. ఆస్పత్రిలో నాడు-నేడు పనులు పూర్తి కాకపోవడంపై ఆర్‌అండ్‌బీ డీఈఈను వివరణ అడిగారు. భామిని రైతు భరోసా కేంద్రం మూసివేసి ఉండడంపై మండిపడ్డారు. అగ్రికల్చర్ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్‌లపై చర్యలకు సిఫార్స్ చేశారు. పూర్తి నివేదిక జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. బొడ్డగూడ సచివాలయంలో సిబ్బంది హాజరు రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

గిరి పుత్రులకు మంచి రోజులు

- గత ప్రభుత్వంలో గిరిజన ఉత్పత్తులు దళారుల చేతికి
- జగనన్న ప్రభుత్వంలో దళారుల ఆగడాలకు చెక్
- ఉత్పత్తులను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్న జీసీసీ
- జీసీఎంఎస్ పరిధిలో ఉత్పత్తుల తయారీ విక్రయం
- 2022-23లో రూ.10.36 కోట్ల విలువైన గిరిజన ఉత్పత్తుల కొనుగోలు
- 2023-24 సంవత్సరంలో కొనుగోలు లక్ష్యం రూ.8.27 కోట్లు



గుమ్మలక్ష్మీపురం మండలంలో గిరిజన ఉత్పత్తును కొనుగోలు చేస్తున్న సిబ్బంది

పార్వతీపురంటౌన్: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిపుత్రులు దళారుల నిలువు దోపిడీకి గురయ్యేవారు. తాము పండించే పంటను కారు చౌకగా మైదాన ప్రాంతం నుంచి వచ్చే దళారులకు అప్పగించేసే వారు. వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వారి వద్ద నుంచి తక్కువ ధరకే కొనుగోలు చేసి వారి శ్రమను దోచుకొనే వారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గిరిజన సహకార సంస్థ (జీసీసీ)ని బలోపేతం చేసింది. ఇప్పుడు వారి సంపదకు వారే యజమానులు. వారే ఉత్పత్తిదారులు. గిరిజనుల నుంచి మద్దతు ధరకు ముడి సరుకులను గిరిజన సహకార సంస్థ కొనుగోలు చేస్తుండడంతో ఆర్థిక ఊరట లభించింది. ముడిసరుకులను నాణ్యమైన ఉత్పత్తులుగా మలచి జీసీఎంఎస్ ద్వారా తిరిగి జనం చెంతకు జీసీసీ చేర్చుతోంది. తక్కువ ధరలకే విక్రయిస్తూ అటు వినియోగదారులకు, ఇటు గిరిజనులకు లాభాల వారధిగా నిలుస్తోంది. దళారుల బారినుంచి గిరిజనులను కాపాడుతూ ఏటా రూ.కోట్ల విలువైన వ్యాపారం సాగిస్తోంది. నాలుగేళ్లలో రూ.22.46 కోట్లు కొనుగోలు చేయగా ఈ ఏడాది రూ.10.36 కోట్లను గిరిజనులకు అందించి ఆర్థిక ఊరటనిచ్చింది. 2023-24 సంవత్సరానికి రూ.8.27 కోట్ల కొనుగోళ్లను లక్ష్యంగా పెట్టుకుంది.

ఉత్పత్తులు ఇలా...

గిరిజనుల నుంచి తేనె, చింతపండు, నరమామిడి వంటి దాదాపు 26 రకాల అటవీ ఉత్పత్తులను ఏటా జీసీసీ కొనుగోలు చేస్తోంది. వాటిని కేంద్రాల్లో నిల్వ చేస్తోంది. ఏడు పారిశ్రామిక కేంద్రాల్లో ప్రాసెసింగ్ చేసిన అనంతరం ఉత్పత్తులను మార్కెట్లో వినియోగదారులకు అందుబాటులోకి తేవడమే దీని లక్ష్యం. పసుపు, కుంకుమ, తేనె, షరబత్, షాంపూలు, సబ్బులు, కాఫీపొడి తదితర 27 ఉత్పత్తులను రిటైల్ ప్రత్యేక ఔట్లెట్లు, సూపర్ బజార్లు, రైతు బజార్లతో పాటు ఆన్‌లైన్‌లో విక్రయిస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లా జీసీఎంఎస్ పరిధిలోని గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో స్టాల్స్ పెట్టి విక్రయాలు నిర్వహించడమే కాకుండా మొబైల్ సేవల ద్వారా మారుమూల పల్లెలకు గిరిజన ఉత్పత్తులను చేరవేస్తోంది.

ఈ ఏడాది లక్ష్యం రూ.8.27 కోట్లు

పార్వతీపురం మన్యం జిల్లాగా ఏర్పడిన తొలి సంవత్సరం గిరిజన ఉత్పత్తులకు మరింత మార్కెటింగ్ చేయాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ.10.36 కోట్ల విలువైన ముడిసరుకును కొనుగోలు చేశారు. వాటిని ఉత్పత్తులుగా మలచి మార్కెటింగ్ చేసేందుకు చర్యలు చేపట్టారు. పార్వతీపురం జీసీసీ పరిధిలో 102 డిపోల్లో గిరిజన ఉత్పత్తుల కొనుగోళ్లకు సంబంధించి గిరిజనులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. 2023-24 సంవత్సరానికి రూ.8.27 కోట్ల విలువైన అటవీ ఉత్పత్తులు కొనుగోలును లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నారు.



పార్వతీపురం పట్టణంలో ఏర్పాటు చేసిన ఆర్ఎండీ స్టాల్



ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరపై గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్రస్తుతం వివిధ అటవీ ఉత్పత్తులకు జీసీసీ చెల్లిస్తున్న మద్దతు ధర ఇలా..

ఉత్పత్తి	మద్దతు ధర (కిలోకు)
చింతపండు	రూ. 32.49
కరక్కాయలు	రూ.18
నల్ల జీడిపిక్కలు	రూ.18
తేనె	రూ.200
ముసిరిక పిక్కలు	రూ.60
మారేడు గడ్డలు	రూ.500
విప్ప పువ్వు	రూ.29
కొండచీపురు(1)	రూ. 45
ఉసిరిక పప్పు	రూ.90
శీకాయలు	రూ.55
కుంకుడు కాయలు	రూ.60

అటవీ ఉత్పత్తుల కొనుగోలు ఇలా...

సంవత్సరం	కొనుగోలు (రూ.కోట్లలో)
2018-19	2.75
2019-20	1.64
2020-21	3.41
2021-22	4.30
2022-23	10.36

ఊరూరా మార్కెటింగ్..

జీసీఎంఎస్‌కు మరింత ఆదాయం చేకూరేలా ఉత్పత్తులను గ్రామస్థాయి ప్రజలకు అందించేందు మొబైల్ సేవలను ప్రారంభించాం. ప్రధాన రైల్వే స్టేషన్లో రైల్వే అధికారులతో మాట్లాడి ఆర్ఎండీ స్టాల్స్‌ను ఏర్పాటు చేశాం. దీనివల్ల గిరిజనులు లబ్ధిపొందడమే కాకుండా ప్రభుత్వానికి మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ప్రతి గ్రామానికి జీసీఎంఎస్ ఉత్పత్తులు సరఫరా అయ్యేలా మొబైల్ సేవలను విస్తృతం చేస్తాం. గిరిజనులు దళారుల చేతిలో మోసపోకుండా డిపోల ద్వారా ఉత్పత్తులను స్థానికంగా కొనుగోలు చేసి ఆర్థికంగా అండగా నిలుస్తున్నాం.

– మహేంద్ర కుమార్, జీసీసీ డివిజనల్ మేనేజర్, పార్వతీపురం మన్యం



రైల్వే స్టేషన్లో ఏర్పాటు చేసిన ఆర్ఎండీ స్టాల్

పోలీసుల అదుపులో ఆటోల్లో చోరీకి పాల్పడుతున్న మహిళలు



వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ సిహెచ్.లక్ష్మణరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: ఆటోల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు మహిళలను టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు టూటౌన్ సీఐ సిహెచ్.లక్ష్మణరావు శనివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. సాలూరుకి చెందిన బంధపు కూర్మారావు ఈ నెల 28న సాలూరు నుంచి విజయనగరం ఆర్టీసీ బస్సులో వచ్చి కాంప్లెక్స్ వద్ద ఆటో ఎక్కి సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వద్ద దిగి తన భార్య హ్యాండ్ బ్యాగ్ చూడగా అందులో రూ. 37,500 పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు కొత్తవలస 202 కాలనీకి చెందిన పాతనేరస్తుల ఫొటోలను బాధితులకు చూపించగా అందులో ముగ్గురు వ్యక్తులను గుర్తించారు. దీంతో స్థానిక ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ వద్ద గంటా కాశేశ్వరి, మేకల రేవతి, ఆవుల పార్వతిలను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 37,500 నగదు రికవరీ చేశామన్నారు. కేసు ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన ఏఎస్ఐ పైడితల్లి, హెచ్‌సీ ప్రసాద్, పీసీ వాసును సీఐ అభినందించారు.

తూర్పుగోదావరి జిల్లా వాసి హత్య



వెంకటరమణ మృతదేహం



ఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ తిరుమలరావు, ఎస్ఐ సురేంద్రనాయుడు

రామభద్రపురం: మండలంలోని రావివలస పంచాయతీ పంతెమామిడివలసకు వెళ్లే దారిలో సీత గుండమ్మ గుడి వద్ద ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మూడు రోజుల కిందట ఓ వ్యక్తిని గుర్తు తెలియని దుండగులు హత్య చేసి సీత గుండమ్మ గుడి సమీపంలో పడేశారు. శనివారం అటువైపుగా వెళ్లిన స్థానికులకు మృతదేహం కనపడడంతో వారు రావివలస సచివాలయ సిబ్బందికి తెలియజేశారు. సచివాలయ సిబ్బంది స్థానిక ఎస్ఐ సురేంద్రనాయుడుకు సమాచారం ఇచ్చారు. దాంతో సీఐ తిరుమలరావు ఎస్ఐ, పోలీస్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుని జేబులో ఉన్న ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ ఆధారంగా ఆ వ్యక్తి తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం బుచ్చెంపేటకు చెందిన సాగి వెంకటరమణ(35)గా గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు మృతుని తలపై పెద్ద బండరాయితో మోది హత్య చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయని, ఇది హత్యేనన్న అనుమానం వ్యక్తం చేస్తూ ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. చనిపోయిన వ్యక్తి వడ్డీ వ్యాపారం చేస్తుంటాడని కుటుంబ సభ్యులు తెలపడంతో ఇక్కడకు ఎందుకు వచ్చాడు, ఎలా మృతి చెందాడు, హత్య చేయబడితే ఏ కారణంతో హత్య చేశారు? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొద్ది నెలల క్రితం భార్యతో విడాకులు తీసుకున్నాడు. అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

యువకుడు బలవన్మరణం



వెంకటరమణ మృతదేహం

వీరఘట్టం: మండలంలోని మహదేవివలసకు చెందిన జన్ని వెంకటరమణ (17) శనివారం గ్రామ శివారు తోటలో ఉరి వేసుకుని బలవన్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. వెంకటరమణ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడని, ఆరోగ్యం కుదుటపడకపోవడంతో మనస్తాపం చెంది ఉరి వేసుకుని చనిపోయినట్లు అతని తండ్రి సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు చేశాడు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిషోరవర్మ తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సీతానగరం: మండలంలోని చినబోగిలి రైల్వే గేట్ సమీపంలో శనివారం ఉదయం గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం.. మృతుడు పార్వతీపురం మండలం లచ్చిరాజుపేట గ్రామానికి చెందిన శెట్టి శంకరరావుగా గుర్తించినట్లు తెలిపారు.

ఫినాయిల్ తాగి ఆత్మహత్యా యత్నం

పార్వతీపురం: పెద్ద చదువులు చదివి ఏ ఉద్యోగం లేకపోవడంతో ఇంట్లో తల్లిదండ్రుల అనే మాటలకు మనస్తాపానికి గురై ఓ యువకుడు ఫినాయిల్ తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. పార్వతీపురం అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు.... మక్కువ మండల కేంద్రానికి చెందిన సీహెచ్ మహేష్ ఎంఎస్సీ చదివాడు. ఎక్కడా ఉద్యోగం చేయకుండా ఇంట్లో ఖాళీగా ఉంటున్నాడు. తల్లిదండ్రులు ఏదో కంపెనీలో ఉద్యోగం చేయమని ఎంత చెప్పినా వినడం లేదు. తల్లిదండ్రుల ఒత్తిడి తట్టుకోలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో మహేష్ ఫినాయిల్‌ను తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి తల్లిదండ్రులకు సమాచారాన్ని ఇవ్వడంతో 108 అంబులెన్స్ ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఇద్దరి ఎంపిక



నీరజను అభినందిస్తున్న పీడీ కృష్ణంరాజు

కొత్తవలస : తిరుపతిలో మే 1వ నుంచి 5వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు కొత్తవలస మండలం దెందేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి విరోతి నీరజ, ఎల్.కోట మండలం గంగుబూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని చిప్పాడ సాయి లలిత ఎంపికైనట్లు దెందేరు హైస్కూల్ పీడీ యు.కృష్ణంరాజు శనివారం తెలిపారు. వీరు విజయనగరం జిల్లా జట్టు తరపున ఆడుతారన్నారు. వీరిని కొత్తవలస వాలీబాల్ అసోషియేషన్ క్లబ్ కార్యదర్శి గొరపల్లి శివ, సభ్యులు మహేంద్ర, సీనియర్ క్రీడాకారులు బాలకృష్ణ, రాజునాయుడు, శ్రీను అభినందనలు తెలిపారు.

రైతుల సమక్షంలో సరిహద్దు రాళ్ల ఏర్పాటు



సరిహద్దురాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న ఇన్‌చార్జి జేసీ పి.విష్ణుచరణ్

సీతానగరం: జిల్లాలో భూముల రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతుల సమక్షంలో సరిహద్దు రాళ్ల ఏర్పాటుచేయాలని ఐటీడీఏ పీఓ, ఇన్‌చార్జి జేసీ పి.విష్ణుచరణ్ రెవెన్యూ, సర్వే సిబ్బందిని ఆదేశించారు. సీతానగరం మండలం పాపమ్మవలస, నీలకంఠాపురం గ్రామాల్లో సరిహద్దురాళ్ల ఏర్పాటు తీరును శనివారం పరిశీలించారు. మండలానికి సమకూర్చిన 5 రోవర్ల సాయంతో సరిహద్దు రాళ్లు వేస్తున్నామని తహసీల్దార్ ఎస్.వి.రమణ వివరించారు. ఒక్కో గ్రామంలో 80 నుంచి 100 రాళ్లు వేస్తున్నామన్నారు. ఈ క్రతువులో మండల సర్వేయర్ శంకరరావుతో పాటు వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు నిమగ్నమయ్యారన్నారు.

వేగవంతంగా గృహనిర్మాణాలు

వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాలను వేగవంతం చేయాలని గృహనిర్మాణ శాఖ అధికారులను విష్ణుచరణ్ ఆదేశించారు. కాశీపేటలోని జగనన్న కాలనీలో జరుగుతున్న గృహనిర్మాణాలను ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ పీడీ రఘురాం, తహసీల్దార్ ఎస్.వి.రమణ, ఎంపీడీఓ ఎం.ఎల్.ఎస్.ప్రసాద్, హౌసింగ్ ఏఈ జానకిరాం, సర్పంచ్ టి. ధనంజయమ్మ, పంచాయతీ కార్యదర్శి మురళీ పాల్గొన్నారు.

అండర్ - 23 వన్డే టోర్నీ విజేత విజయనగరం



అండర్ 23 నార్త్ జోన్ వన్డే టోర్నీ విజేత విజయనగరం జట్టు

విజయనగరం/విజయనగరం రూరల్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ – 23 నార్త్ జోన్ క్రికెట్ వన్డే టోర్నీ విజేతగా విజయనగరం జట్టు నిలిచింది. జిల్లా కేంద్రంలోని సర్ విజ్జీ స్టేడియంలో ఈ నెల 26 నుంచి అంతర్ జిల్లాల వన్డే క్రికెట్ టోర్నీ ప్రారంభం కాగా శనివారంతో ముగిసింది. ఆఖరి రోజు శనివారం విజయనగరం – తూర్పుగోదావరి జట్ల మధ్య జరిగిన వన్డే మ్యాచ్‌లో విజయనగరం జట్టు 8 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న తూర్పుగోదావరి జట్టును విజయనగరం బౌలర్లు కట్టడి చేశారు. దీంతో తూర్పుగోదావరి జట్టు 48.2 ఓవర్లలో 154 పరుగులకు ఆలౌవుట్ అయింది. విజయనగరం జట్టు బౌలర్‌లలో లెగ్ స్పిన్నర్ దీపు భార్గవ్ తన 10 ఓవర్లలో 35 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు సాధించాడు. జట్టు కెప్టెన్ జై దుర్గాకుమార్ 9 ఓవర్లలో 20 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు సంపాదించారు. తూర్పుగోదావరి జట్టు బ్యాటర్లలో ఓపెనింగ్ బ్యాటర్ జె.సూర్య 26 పరుగులు చేయగా మిడిల్ ఆర్డర్ బ్యాటర్ కేఎస్ఎస్ జయంత్ 23 పరుగులు మాత్రమే సాధించారు. అనంతరం 155 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన విజయనగరం జట్టు 36.1 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. ఆ జట్టు ఓపెనింగ్ బ్యాటర్ ఎం.అభిలాష్ అర్ధ సెంచరీతో (106 బంతుల్లో 57 పరుగులు, నాటౌట్) రాణించగా, మరో ఓపెనర్ సాయి సందీప్ 30 పరుగులు, ఫస్ట్ డౌన్‌లో వచ్చిన జీఎస్వీ తేజ 32 పరుగులు, ఎం.రవికిరణ్ 21 పరుగులు చేసి నాటౌట్‌గా రాణించి జట్టుకు విజయాన్ని అందించారు. ఈ టోర్నీలో శ్రీకాకుళం, తూర్పుగోదావరి జట్లపై వరుస విజయాలతో 8 పాయింట్లు సాధించిన విజయనగరం జట్టుకు, విశాఖపట్నం జట్టుతో జరిగిన మ్యాచ్ వర్షంతో నిలిచిపోవడంతో 2 పాయింట్లు దక్కాయి. దీంతో విజయనగరం జట్టుకు 10 పాయింట్లు లభించాయి. విశాఖ జట్టు రెండు విజయాలు ఒక మ్యాచ్ రద్దుతో పది పాయింట్లు దక్కాయి. అయితే నెట్ రన్‌రేట్‌లో విజయనగరం జట్టు మెరుగ్గా ఉండటంతో పాయింట్లు పట్టికలో అగ్రస్థానం లభించింది. టోర్నీ ఆసాంతం రాణించి, విజేతగా నిలిచిన విజయనగరం జట్టు ఆటగాళ్లను, కోచ్‌లు చంద్రశేఖర్ చందక రమేష్‌లను విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎమ్ఎల్ఎన్ రాజు, ట్రెజరర్ పి.సీతారామరాజు, సెలక్టర్లు బంగార్రాజు, వర్మ, సర్పరాజులు అభినందించారు.

వేగవంతంగా కేసుల దర్యాప్తు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఏఎస్పీ దిలీప్‌కిరణ్



సమావేశంలో పాల్గొన్న అధికారులు

- గంజాయి, సారా విక్రయాల కట్టడికి కఠిన చర్యలు
- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశించారు. ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికారులతో శనివారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. గంజాయి, సారా రవాణా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో అధికారులతో కలిసి సారా తయారీ కేంద్రాలపై దాడులు చేయాలని సూచించారు. ఓపెన్ డ్రికింగ్, డ్రంక్‌అండ్ డ్రైవ్ తనిఖీలు జరిపి రోడ్డుప్రమాదాలను కట్టడి చేయాలన్నారు. కోర్టు వాయిదాలకు సాక్షులు సక్రమంగా హాజరవుతున్నారా? లేదా?, వారిని ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తున్నారా అన్న సమాచారాన్ని కోర్టు కానిస్టేబుల్ ద్వారా తెలుసుకొని సాక్షులు నిర్భయంగా జరిగిన వాస్తవాన్ని న్యాయమూర్తి ఎదుట చెప్పేలా తర్ఫీదు ఇవ్వాలన్నారు. తప్పుచేసిన వారికి శిక్ష పడితేనే న్యాయం జరినట్టుగా భావించాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ డాక్టర్ దిలీప్‌కిరణ్, ఏఎస్పీ సునీల్‌షరోన్, పాలకొండ ఎస్‌డీపీఓ కృష్ణారావు, దిశ డీఎస్పీ ఎస్.ఆర్.హరిత, ఏఆర్ డీఎస్పీ నాగేశ్వరరావు, ఎస్‌బీ సీఐ శ్రీనివాసరావు, ఏపీపీ కిమిడి చంద్రకుమార్, గొర్లి వెంకటరమణ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.